ప్రజాశక్తి

శుక్రవారం 26 డిసెంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





సిఐటియు 'మహాసభల' విజయవంతానికి

నేడు, రేపు ప్రచార జాతాలు

- సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబ్బారావు, రమేష్



మాట్లాడుతున్న రమేష్, సుబ్బారావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సిఐటియు అఖిలభారత 18వ మహాసభలను విజయవంతం చేయాలనే లక్ష్యంతో ప్రకాశం జిల్లావ్యాప్తంగా డిసెంబరు 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు విస్తృత ప్రచార జాతా నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ తెలిపారు. గురువారం ఒంగోలులో మీడియాతో వారు మాట్లాడారు. జిల్లాలోని అన్ని వర్గాల కార్మికులు, ఉద్యోగులు ఈ జాతాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార జాతా కనిగిరి, మార్కాపురం, ఒంగోలు రెవెన్యూ డివిజన్ల పరిధిలో సాగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలు, సిఐటియు 18వ మహాసభల లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ జాతా ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

ఈ నెల 26న ఉదయం 8 గంటలకు పామూరులో ప్రచార జాతా ప్రారంభమవుతుందని తెలిపారు. ఉదయం 10 గంటలకు కనిగిరి, 11.30 గంటలకు పొదిలి, మధ్యాహ్నం 12 గంటలకు దరిశి, ఒంటి గంటకు కురిచేడు, రెండు గంటలకు దొనకొండ, 3.30 గంటలకు త్రిపురాంతకం, సాయంత్రం 4.45కు యర్రగొండపాలెం, 6 గంటలకు పెద్ద దోర్నాల, రాత్రి 7కు పెద్దారవీడు మీదుగా మార్కాపురం చేరుకొని రాత్రి బస చేస్తారని తెలిపారు.

27న ఉదయం 8 గంటలకు మార్కాపురం నుంచి జాతా తిరిగి ప్రారంభమై.. 9.30 గంటలకు తర్లుబాడు, 11కు కంభం, మధ్యాహ్నం 12 గంటలకు రాచర్ల, ఒంటి గంటకు గిద్దలూరు, మూడు గంటలకు బి.పేట, సాయంత్రం 4.30కు హనుమంతుని పాడు, 5.30కు వెలిగండ్ల మీదుగా 6.30 గంటలకు సియస్.పురం చేరుకొని ప్రచార జాతా ముగుస్తుందన్నారు.

ఒంగోలు రెవెన్యూ డివిజన్‌లో రెండో జాతా

ఈ నెల 26న ఉదయం ▶ 2లో

తగ్గేదేలేదట..!



అసంపూర్తిగా నిర్మించిన మార్కాపురం మెడికల్ కాలేజ్ (ఫైల్)

- మార్కాపురం మెడికల్ కాలేజీ పిపిపి విధానంపై సిఎం స్పష్టం
- ఆందోళన చేపట్టిన వైసిపి..
- వ్యతిరేకించిన వామపక్ష పార్టీలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వం పిపిపి పద్ధతిలో చేపట్టడాన్ని మరోసారి సమర్థించుకుంది. సిఎం చంద్రబాబు వీటిపై నిర్వహించిన సమీక్షలో పిపిపి విధానంపై వెనక్కు తగ్గాల్సిన అవసరం లేదని మరోసారి స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఇదే విధానం అమలు జరుగుతోందని, ముందుకే పోవాలని ఆదేశించారు. ప్రైవేటు, ప్రభుత్వ భాగస్వామ్య విధానంపై రాజీ కూడా లేదని చెప్పారు. వైద్య కళాశాల టెండర్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. అంటే మార్కాపురం మెడికల్ కాలేజీ పిపిపి విధానంలోనే నడవనున్నట్లు సుస్పష్టమవుతోంది. తమ ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధీనంలో నడిచేలా చేపడితే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పిపిపి విధానం పేరుతో ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తోందని వైసిపి ఆందోళన చేపట్టింది. ఇటీవల కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. పార్టీ నేతలు గ్రామాల్లో తిరిగి ఇదొక పెద్ద ఎజండాగా తీసుకున్నారు. ఊరూవాడా తిరిగారు. సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఒంగోలులో పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. పార్టీ యంత్రాంగం పెద్దఎత్తున కదిలింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వైసిపి చేపట్టిన పెద్ద కార్యక్రమం కూడా ఇదేనని చెప్పొచ్చు. ఇక ఈ పాటికే ఈ విధానాన్ని సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రజాసంఘాలూ తప్పుపట్టాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వం తాను తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉంది. సిఎం మరోసారి దీనిపై స్పష్టత ఇచ్చారు. పిపిపి విధానంపై వెనక్కు తగ్గేదేలేదని తేల్చారు. ఇక తెలుగుదేశం నేతలు దీనిపై వివరణ ఇవ్వడానికి నానాతంటాలు పడుతున్నారు. పిపిపి విధానం అంటే ప్రైవేటువరం కాదని చెబుతున్నారు. ప్రభుత్వం ఆధీనంలోనే ఉంటుందని మంత్రి డోలావీరాంజనేయస్వామి పదేపదే అంటున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల గానే పేరు పెడతామని చెబుతున్నారు. వాస్తవానికి ఒక ప్రభుత్వ సంస్థ నిర్వహణ, నిర్మాణం వంటివి ప్రైవేటు సంస్థలకు అప్పగించాక దాన్ని ప్రైవేటుపరమే అంటారు. ఇందులో సందేహం లేదు. లీజుల పేరుతో తీసుకున్న భూములను ఎక్కడైనా ప్రభుత్వానికి అప్పగించారా? అనేదీ ఆలోచించాలి. ఇప్పుడు అన్ని ప్రభుత్వ వ్యవస్థలను నిర్వహించలేక ప్రైవేటుపరమే చేస్తున్నారు. విశాఖ స్టీల్ పరిశ్రమను ఏం చేస్తున్నారనేది చెప్పాల్సిన అవసరం ఉందా? అనేదీ కూటమి నేతలు ఆలోచించాలి. కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వం నిర్వహించాల్సిన వ్యవస్థలను అప్పగిస్తున్నారు. ప్రజలకు ఏం జరుగుతుందో తెలియదా? ఇప్పుడు తప్పును ఒప్పు అంటే నమ్ముతారా? అనేదీ ఆలోచించడం లేదు. పిపిపి విధానం అంటే ఎవరు పెట్టుబడి పెడతారు? ఆసుపత్రి కట్టిన సంస్థలు లాభాల కోసం పనిచేస్తాయా? సేవ కోసం పనిచేస్తాయా? అనేదీ జనానికి తెలియదా? ప్రస్తుతం ప్రైవేటు ▶ 2లో

సునామీకి 21 ఏళ్లు..

- ఆ మాటంటేనే హడలిపోతున్న గంగపుత్రులు
- అప్పటి రాకాసి అలలకు ఇక్కడ 12 మంది బలి..
- ఆ పెను విషాదాన్ని నేటికీ గుర్తు చేసుకుంటున్న మత్స్యకారులు



బింగినపల్లిలో సునామీ కాలనీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

2004 డిసెంబర్ 26వ తేదీ.. ఆ రోజు ఆదివారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో సముద్రం ఒక్కసారిగా ఉగ్ర రూపం దాల్చింది.. రాకాసి అలలు ఉవ్వెత్తున ఎగసి.. ఊరి మీద పడ్డాయి. ఎలాంటి హెచ్చరికలు లేకుండా వచ్చిన పెను ఉప్పెన మత్స్యకార జీవనాన్ని అతలాకుతలం చేసింది. ఆ రాకాసి అలల ధాటికి మత్స్యకార గ్రామాల్లో ప్రజలందరూ కట్టుబట్టలతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారు. ఈ రాకాసి అలలను సునామీగా వాతావరణ శాస్త్రవేత్తల పేర్కొన్నారు. ఆ సునామీ తాకిడికి శింగరాయకొండ మండలంలోని పాకల సముద్ర తీరానికి ఆదివారం నాడు సరదాగా వచ్చిన కందుకూరుకు చెందిన ఆరుగురు మతి చెందారు. ఊళ్లపాలెం గ్రామానికి చెందిన మరో ఆరుగురు కూడా మృత్యువాత పడ్డారు. వీరిలో ఉప్పు కొటార్లకు వెళ్లిన వాళ్లు కొందరైతే.. వేటకు వెళ్లి ఇరుక్కుపోయిన వారు మరికొందరు ఉన్నారు. మొత్తం 12 మంది ఈ సునామీకి బలయ్యారు. ఈ సునామీ సష్టించిన బీభత్సానికి నేటికీ 21 సంవత్సరాలు.

21 ఏళ్ల నుంచి సునామీ పేరెత్తితేనే గంగపుత్రులు హడలెత్తిపోతున్నారు. ఆ రోజు సష్టించిన భీభత్సాన్ని ఇప్పటికీ మర్చిపోలేక పోతున్నారు. సునామీ తాకిడికి మత్స్యకార కుటుంబాలు తల్లడిల్లిపోయాయి. నిత్యం సముద్రంపై జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు ఆ సముద్రమే వచ్చి ఊరి మీద పడటంతో కోలుకోలేని దెబ్బతిన్నారు. అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సునామీ ఉదయం 8 గంటలకు వస్తే మధ్యాహ్నం రెండు గంటలకల్లా ఊళ్ల పాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు వచ్చి సునామీకి కారణంగా మండలంలో మరణించిన 12 మంది మృత దేహాల వద్ద నివాళులర్పించి... సునామీ సష్టించిన బీభత్సం గురించి అప్పటి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత మత్స్యకారులకు పెద్ద ఎత్తున రుణాలు ఇచ్చి మళ్లీ వాళ్లని సముద్రంలో మత్స్య వేట చేసుకునే విధంగా అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాకల గ్రామ పంచాయతీలోని పల్లిపాలెం చెల్లమ్మ గారి పట్టపాలెం, పోతయ్య గారి పాలెం క్రాంతి నగర్, శాంతినగర్ మత్స్యకారులు సునామీ వల్ల తీవ్రంగా నష్టపోయారు. ఊళ్లపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని దేవలం పల్లెపాలెం బావి వద్ద పల్లెపాలెం మత్స్యకారులకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. ఒక్క మత్స్యకారులకే కాకుండా సముద్ర తీరం ప్రాంతంలో ఉన్న గిరిజనుల మీద కూడా ఈ ప్రభావం పడింది. గిరిజనులు కూడా తీవ్రంగా నష్టపోయారు. అప్పుడు హైదరాబాదు రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బింగినపల్లి గిరిజన కాలనీలో సునామీ కాలనీ నిర్మించి.. ఆ కాలనీని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ బందం ప్రారంభించింది. ఆ కాలనీలో సుమారు 200 గహాలు పైగా రియల్‌ఎస్టేట్ హైదరాబాద్ బందం వచ్చి.. నిర్మించింది. దానికి సునామీ కాలనీగా నామకరణం చేశారు. ఊళ్ల పాలెం గ్రామంలో సముద్రపు ఒడ్డున వలలో బోట్లు వేసుకునేందుకు ఓ రూము నిర్మాణం జరుగుతుండగా సునామీ వచ్చిన ▶ 2లో



పోలీసులతో ఘర్షణ పడుతున్న ఏఎస్ఐ రవి

మద్యం మత్తులో

ఏఎస్ఐ హల్‌చల్

▶ 2లో

- చిన్నారులతో క్రిస్మస్ వేడుకలు



నగరంలోని రామ్‌నగర్‌లో ఉన్న బాలసదన్‌లో చిన్నారులతో కలిసి కలెక్టర్ పి.రాజాబాబు సతీమణి పి.సుజాత గురువారం క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. కేకును కట్ చేసి..స్వీట్స్‌ను పంచారు. - ప్రజాశక్తి, ఒంగోలు

తగ్గేదేలేదట..!

(మొదటిపేజీ తరువాయి)

ఆసుపత్రుల్లో ఎలాంటి పరిస్థితి ఉందో జనానికి తెలియదా? పిపిపి విధానం అంటే కూడా దాదాపుగా ఇదే. ప్రైవేటు సంస్థలపై ప్రభుత్వ నియంత్రణ కూడా ఒట్టిమాటే.. రిమ్స్‌ను తనిఖీ చేసినట్లు రేపు మార్కాపురం పిపిపి విధానంలో నడిచే కాలేజీకి మంత్రులు వెళ్లగలరా? వైద్యం తీరును పరిశీలించగలరా? అంటే ఏమీ సాధ్యం కావనే చెప్పాలి. ఏదేమైనా రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీలపై పిపిపి విధానంలోనే ముందుకు పోవాలనే పట్టుదలతోనే ఉంది.

సునామీకి 21 ఏళ్లు..

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత ఆ అలల తాకిడికి ఆ రూము దెబ్బతింది. అక్కడ ఉన్న మత్స్యకారులు సునామీ గుర్తుగా నేటికీ ఆ రూమును అలాగే ఉంచేశారు. అప్పట్లో మత్స్యకారులను పరామర్శించేందుకు కేంద్ర, రాష్ట్ర మంత్రులతో పాటు గవర్నర్ సైతం సముద్ర తీరానికి వచ్చి మత్స్యకారులకు భరోసా ఇచ్చి వెళ్లారు. అప్పటి సిపిఎం రాజ్యసభ సభ్యులు పి.మధు కూడా ఊళ్ళ పాలెం గ్రామానికి వచ్చి మత్స్యకారులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం ముందుకు వచ్చి మత్స్యకారులను ఆదుకున్నప్పటికీ సునామీ భయం నేటికీ మత్స్యకారుల్లో కనిపిస్తూనే ఉంది. డిసెంబర్ వచ్చిందంటే మత్స్య వేట అంతంత మాత్రంగానే ఉంటుంది. సునామీ జ్ఞాపకాలతో బోటు తీయాలంటే ఆ రాకాసి అలలు కళ్ల ముందే కనిపిస్తుంటాయని మత్స్యకారులు చెబుతున్నారు.

'సునామీ'కి పెళ్లయింది..!

సునామీకి పెళ్లయ్యేదేంటి అనుకుంటున్నారేమో..? ఇది నిజమే అది ఎలాగంటే..! శింగరాయకొండ మండలం, చెల్లెమ్మ గారి పట్టపాలెంలో మత్స్యకార గ్రామంలో 'గాలివాన' అనే వ్యక్తికి సునామీ వచ్చిన రోజే కూతురు పుట్టింది. అందువల్ల ఆ కూతురికి 'సునామీ'గా నామకరణం చేశారు. ఈమె తండ్రి పేరు కూడా విచిత్రంగా 'గాలి వాన'.. ఈయన పుట్టినప్పుడు కూడా పెద్ద గాలివాన ఆ ప్రాంతంలో రావడంతో వారి తల్లిదండ్రులు ఆయనకు 'గాలి వాన' అని నామకరణం చేశారని మత్స్యకారులు చెప్పారు. తండ్రి పేరు 'గాలి వాన' కాగా కూతురి పేరు 'సునామీ' కావటం గమనార్హం.

నేడు, రేపు ప్రచార జాతాలు

(మొదటిపేజీ తరువాయి)

10 గంటలకు టంగుటూరులో ప్రారంభమయ్యే రెండో ప్రచార జాతా సింగరాయకొండ, పొన్నలూరు, కొండేపి, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పల పాడు మీదుగా సాగుతుందని చెప్పారు.డిసెంబరు 27న ఒంగోలు నగరంలో విస్తృత ప్రచారం నిర్వహించి, అనంతరం కొత్తపట్నం మండలంలోని ప్రచారం చేపట్టే కార్యక్రమం ముగుస్తుందన్నారు.

కార్మిక ఉద్యమాలకు దిశానిర్దేశం...

ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు 18వ జాతీయ మహాసభలను విజయవంతం చేయడమే ఈ ప్రచార జాతాల ప్రధాన లక్ష్యమని సిఐటియు నాయకులు స్పష్టం చేశారు. కేంద్రం తీసుకొస్తున్న నూతన కార్మిక చట్టాలను తిప్పికొట్టేందుకు, ఆంధ్రుల హక్కుగా సంక్రమించిన విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకునేందుకు మహాసభలు వేదిక కావాలని పేర్కొన్నారు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా సాగించే ఉద్యమాలకు ఈ మహాసభలు స్పష్టమైన దిశానిర్దేశం చేస్తాయని తెలిపారు. జిల్లాలోని నలుమూలల నుంచి వేలాదిగా కార్మికులు, ఉద్యోగులు విశాఖ మహాసభలకు తరలివచ్చి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు.

మనుధర్మ ప్రతులు దహనం

ప్రజాశక్తి-దర్శి

మనుధర్మం వద్దు అంబేద్కర్ రాజ్యాంగ ముద్దు అని నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు, డప్పు కళాకారుల పోరాట సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకుంట గోవింద ప్రసాద్ మాదిగ తెలిపారు. మండల పరిధిలోని తూర్పు చవటపాలెంలో మను సంస్కృతి దహన్ దివాస్ కార్యక్రమంలో భాగంగా మనుధర్మ ప్రతులను శుక్రవారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో గర్నెపూడి ప్రేమ్ కుమార్, సన్నీ, బాబు తదితరులు పాల్గొన్నారు

శనగను ముంచుతున్న మంచు

- రాలుతున్న పూత, పిందె

- దిగుబడి తగ్గుతుందని రైతుల ఆవేదన



సాగులో ఉన్న శనగ పంట

ప్రజాశక్తి-కొండపి

శనగపంటపై అధిక మంచు ప్రభావం చూపుతోంది.దీంతో పూత, పిందె రాలిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని నేతివారిపాలెం, గోగినేనివారిపాలెం, కట్టావారిపాలెం, పెరిదేపి, ముప్పవరం, చోడవరం తదితర గ్రామాలలో 7వేల ఎకరాల్లో శనగ పంట సాగు

మంచు ప్రభావంతో తెగులు

మంచు ప్రభావంతో శనగ పంటకు తెగుళ్ల వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. మంచు విపరీతంగా కురుస్తుండటంతో మొక్క ఎండిపోయి, పూత రాలిపోతుందని తెలిపారు. దీంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఎకరాకు రూ.15వేలు నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేశామని, పంట దెబ్బతింటే పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడిపై ఆందోళన

మండలంలో గత ఏడాది శనగ పంట ఎకరాకు 6 నుంచి 9 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మంచు ప్రభావంతో ఈ ఏడాది 5 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి కూడా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మద్దతు ధర ఇవ్వాలి

గతేడాది శనగ దిగుబడి బాగా వచ్చినా మద్దతు ధర లేక రైతులు నష్టపోయారు. ఈ ఏడాదైన ప్రభుత్వం క్వింటా శనగలు రూ.8 నుంచి 10వేలు ప్రకారం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

మంచు ప్రభావంతో నష్టపోతున్నాం



చింతల వెంకటరావు, రైతు

ఈ ఏడాది మంచు అధికంగా కురుస్తోంది. శనగ పంట ఏపుగా పెరిగినా పూత రాలిపోతుంది. దీంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. అందువల్ల పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

క్వింటాకు రూ.10వేలు మద్దతు ధర ఇవ్వాలి

బెజవాడ వెంకటసుబ్బారావు,రైతు



గతేడాది దిగుబడి వచ్చినా ధర రాలేదు. ఈ ఏడాది మంచు ప్రభావంతో దిగుబడి కూడా తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వం క్వింటాకు రూ. 10వేల మద్దతు ధర ప్రకటించాలి.

ట్రాఫిక్ సమస్యతో ప్రజల ఇక్కట్లు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- కొండపి

కొండపిలోని టంగుటూరు రోడ్‌లో ట్రాఫిక్ నిత్య సమస్యగా మారింది. గురువారం క్రిస్మస్ పండుగ కావడంతో వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున దుకాణాల వద్దకు వచ్చారు.దీంతో రోడ్లు ఇరుకుగా మారాయి. వాహనా రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎక్కడ వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. పనుల మీద వచ్చిన ప్రజలు తమ ద్విచక్రవాహనాలను రోడ్లపైనే నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. వాహనాలు నిలుపుకోనేందుకు రోడ్డ పక్కన ఉన్న దుకాణా దారులు స్థలం చూపించపోవడంతో దుకాణాల దగ్గరకు వచ్చిన వారు తమ వాహనాలను రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. దీంతో పాదచారులు వాహనాలు ఎక్కడ తగులుతాయోనని భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా జెండా చెట్టు దగ్గర నుంచి తహశీల్దారు కార్యాలయ వరకూ, గాంధీ బొమ్మ సెంటర్‌లో రోడ్డు వెడల్పు తక్కువగా



కొండపిలోని టంగుటూరు రోడ్డులో నిలిచిన ట్రాఫిక్

ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ తలెత్తుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై వాహనాలు నిలుపుదల చేయకుండా తగు చర్యలు తీసుకొని ట్రాఫిక్ సమస్య నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-పిసిపల్లి

వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేయాలని, ప్రాజెక్టు పరిధిలో పిసిపల్లి మండలాన్ని చేర్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టిడిపి అధ్యక్షుడు వేమూరి రామయ్య కోరారు. సిఎంను కలిసి పిసిపల్లి మండలంలోని కరువు పరిస్థితులు, వలసల గురించి, వివరించారు.



చంద్రబాబుతో వేమూరి రామయ్య

మండలంలో బయోగ్యాస్ ప్లాంట్, ఎంఎస్ఎంఇ పార్క్ ను ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు వలసల నివారణకు, అనారోగ్య సమస్యల నుంచి కాపాడేందుకు , బీడు భూములు సాగు చేసుకునేందుకు, ఏకైక పరిష్కార మార్గం వెలి గొండ ప్రాజెక్టు అని , దానిని పూర్తిచేసి పిసిపల్లిమండలాన్ని చేర్చాలని సిఎంను తాను కోరినట్లు రామయ్య తెలిపారు.

కారు ఢీకొని యువకుడు మృతి

- పోలీసుల తీరునకు నిరసనగా..
- జాతీయ రహదారిపై మృతుడి బంధువుల ధర్నా

ప్రజాశక్తి-జరుగుమల్లి

కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన జరుగుమల్లి మండలం వావిలేటిపాడు వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గుంటుపల్లి రాజేంద్ర (26) అనే యువకుడు మృతి చెందారు. మృతుడు ఇండియన్ పెట్రోలు బంకు వద్ద రోడ్డు మార్జిన్‌లో నడిచి పోతుండగా టంగుటూరు వైపు నుంచి వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది. దీంతో రాజేంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య దైవకృప జరుగుమల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు స్పందించక పోవడంతో మృతుడి కుటుంబ సభ్యులు 16వ నంబరు జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. దీంతో వాహనాల రాక పోకలకు అంతరాయం కలిగింది. ఈ విషయం గురించి తెలుసుకున్న శింగరాయకొండ సిఐ చావా హజరత్తయ్య, జరుగుమల్లి యస్ఐ మహేష్ ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన కారులతో మాట్లాడారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మృతుడి బంధువులు ధర్నాను విరమించారు.



మృతిచెందిన రాజేంద్ర



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

హైదరాబాద్‌కు ఆర్‌టిసి బస్సు సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి- దొనకొండ

దొనకొండ నుంచి హైదరాబాద్‌కు ఆర్‌టిసి సూపర్ లగ్జరీ బస్సును బుధవారం రాత్రి ప్రారంభించారు. గతంలో దొనకొండ ప్రాంత ప్రజలు హైదరాబాద్ వెళ్లేందుకు మార్కాపురం, కురిచేడు, వినుకొండ తదితర ప్రాంతాలకు వెళ్లి బస్సులు ఎక్కాల్సి వచ్చేంది. ఈ నేపథ్యంలో ప్రజల విజ్ఞప్తి మేరకు పొదిలి ఆర్‌టిసి డిపో మేనేజర్ శంకర్‌రావు పొదిలి నుంచి దొనకొండ మీదుగా హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేశారు. బస్సు బుధవారం రాత్రి దొనకొండకు చేరింది. స్థానికులు బస్సు డ్రైవర్, కండక్టర్‌కు పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా పొదిలి ఆర్‌టిసి డిపో మేనేజర్ శంకర్‌రావు మాట్లాడుతూ ఈ బస్సు ప్రతిరోజూ రాత్రి 9 గంటలకు పొదిలిలో బయలు దేరి 9-45 గంటలకు దొనకొండకు చేరుతుందన్నారు. 10 గంటలకు దొనకొండలో బయలుదేరి కురిచేడు, వినుకొండ మీదుగా హైదరాబాద్ బిహెచ్ఇఎల్‌కు ఉదయం 5గంటలకు చేరుతుందన్నారు. తిరిగి రాత్రి 9గంటలకు బిహెచ్ఇఎల్‌లో బయలుదేరి ఉదయం 5 గంటలకు దొనకొండకు చేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలోఆర్‌టిసి కార్గో పార్శిల్ నిర్వాహకుడు షేక్ జాబీర్, రమేష్, రామిరెడ్డి, వ్యాపారులు చలపతి, రామలింగయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బస్సు డ్రైవర్, కండెక్టర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-కొండపి

ప్రార్థించే పెదవుల కన్నా... పేదవారికి సాయం చేసే చేతులు మిన్నా అని ప్రముఖ పారిశ్రామిక వేత్త చింతల ఎక్స్‌పోర్ట్స్ అధినేత చింతల వెంకటేశ్వర్లు తెలిపారు. కొండపిలోని హార్మోన్ ప్రార్థన మందిరం, గోగినేని వారిపాలెంలో చింతల వెంకటేశ్వర్లు ఆధ్వరయంలో సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యేసుక్రీస్తు జన్మదిన వేడుకలు ప్రపంచ దేశాలలో ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. పాస్టర్ జాన్సన్ మాట్లాడుతూ చింతల వెంకటేశ్వర్లు లాంటి మహానుభావులు తమ ఔదార్యాన్ని ఇలాంటి సందర్భాలలో చూపిస్తున్నారన్నారు. తన సంపాదనలో కొంత, పేద , మధ్య తరగతుల వారికి పంచడం గొప్ప విషయమన్నారు. అనంతరం పేదలకు దుస్తులు, చిన్నారులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. మహిళలకు చీరలు , స్వీట్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నం సుబ్బారావు, మాజీ సర్పంచి చింతల సుబ్బారావు, చింతల వెంకటరావు, విజయరామరాజు , వెన్నూరు సుధాకర్, పెట్లూరు బాలకోటేశ్వరరావు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కొండపిలోని చర్చిలో పాస్టర్ సాంబశివరావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పెద్ద దోర్నాల : మండల పరిధిలోని గ్రామాల్లో క్రిస్మస్ నిర్వహించారు ఈ సందర్భంగా ప్రజలు చర్చలకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. అయినముక్కల గ్రామంలో క్రైస్ట్ చర్చ్‌లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి సంఘ కాపరి పాస్టర్ అగస్టిన్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాటి మధు, మర్రి చెన్నయ్య, బొమ్మలాపురం విజయ, నర్రా వెంకటరత్నం, ఇల్లా అంకయ్య, గోన లివింగ్ స్టన్, గూడూరి దినకరన్ తదితరులు పాల్గొన్నారు.

దర్శి : క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శి బాప్టిస్ట్ చర్చితో అన్ని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కొన్ని చర్చిల్లో అన్నదానం నిర్వహించారు.

కంభం : స్థానిక గాయత్రి నవోదయ కోచింగ్ సెంటర్ ఆవరణలో మహాత్మ జ్యోతిరావుపూలే, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి సర్మించుకున్నారు. అనంతరం క్రిస్మస్ సందర్భంగా కందులాపురం పంచాయతీ, ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న పారిశధ్య కార్మికులకు నూతన చీరలు , దుప్పట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కంభం వీరభద్రాచారి, బహుజన పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు దాసరి యోబు. సలహాదారుడు ఒ. అల్లూరయ్య. ఎన్‌జిఒ నాయకుడు వేముల అనిల్ రాజ్, ఎస్‌టి,ఎస్‌టి మానిటరింగ్ కమిటీ జిల్లా చైర్మన్ గూడూరి అన్నోజి రావు తదితరులు పాల్గొన్నారు.



కొండపిలో దుస్తులు అందజేస్తున్న దాత వెంకటేశ్వర్లు



పెద్దదోర్నాలో దుస్తులు అందజేస్తున్న దాత



కంభంలో దుస్తులు అందజేస్తున్న దాతలు

దొంగల హల్‌చల్

- నాలుగు గృహాల్లో చోరీ
- బంగారు ఆభరణాలు
- రూ.2.50 లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి -పెద్దదోర్నాల

మండల కేంద్రమైన పెద్దదోర్నాలలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. ఒకటికాదు రెండు ఏకంగా ఒకే రోజు నాలుగు ఇళ్లలో మంగళవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. రమేష్ , సుబ్బయ్య, బాలకష్ణ, పల్లా శివ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. పల్లా శివ ఇంట్లో226 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2.5 లక్షల నగదును దొంగలు అహరించారు. బాధితులు రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి నరసరావు పేట వెళ్లారు. బాధితులు బుధవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిగతా ముగ్గురి ఇంట్లో విలువైన వస్తువులు ఏమి పోలేదని బాధితులు తెలిపారు. ఎస్ఐ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో క్యూ టీం రప్పించి ఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించారు. సమీపంలోని సిసి కెమెరాలను పరిశీలించారు ఇద్దరు దొంగలుముసుగు, కాళ్లకు సాక్షులు, చేతులకు గ్లౌజులు ధరించి చోరీకి పాల్పడినట్లు సిసి కెమెరాల్లో నమోదు అయిఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.25 వేల ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి విశాల సహకార పరపతి సంఘం చైర్మన్ పూనాటి వెంకట్రావు పేద ముస్లిం యువతీ వివాహానికి రూ 25 వేల ఆర్థిక సాయం గురువారం అందజేశారు. స్థానిక జవహర్ నర్సింగ్ హోమ్ సెంటర్‌లో షేక్ అబ్దుల్ కలాం గౌసియా బేగం దంపతుల కుమార్తె వివాహంలో పాల్గొని ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా పూనాటి వెంకట్రావుకు పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి బాజీ వలి, ఎస్‌కె. మునీర్, చాంద్ బాషా, రఫీ , గురవయ్య పాల్గొన్నారు.



నివాళుర్పిస్తున్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట

పోతుల చెంచయ్యకు నివాళి

ప్రజాశక్తి-టంగుటూరు

పోతుల చెంచయ్య సేవలు ఎనలేనవని రాష్ట్ర సాంఘిక సంక్షేయ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు తండ్రి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పోతుల చెంచయ్య 29వ వర్ధంతి టంగుటూరులో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి స్వామి పాల్గొని పోతుల చెంచయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, టిడిపి నాయకులు,ఉన్నారు.



ప్రజాశక్తి 2026 క్యాలెండర్‌ను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ప్రజాశక్తి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తర్లుపాడు

రైతు నాయకులు అప్పలరాజు అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి - పంగులూరు

అనకాపల్లి జిల్లా రైతు సంఘం కార్యదర్శి అప్పలరాజును అరెస్టు చేయడం అన్యాయమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలుపనేని రామారావు గురువారం ఖండించారు. అనకాపల్లి జిల్లాలో రైతాంగం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుతున్న అప్పలరాజును చట్టవిరుద్ధంగా నిర్బంధించటం దారుణమని పేర్కొన్నారు. అప్పలరాజుపై పెట్టిన పీడీ యాక్ట్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల కోసం ఉద్యమాలు నిర్వహించే నేతలపై పీడి యాక్టు విధించి, నిబంధించటం తగదని అన్నారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు,



రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు

తాత్కాలిక ఆనందం పొందేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల కోసం, రైతాంగం కోసం ఆయన నిరంతరం పనిచేస్తున్నాడని అన్నారు. ఆయనను పీడీ యాక్టుపై అరెస్ట్ చేయటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. డ్రగ్స్, మానవ అక్రమ రవాణా, దోపిడీలు, హత్యలు, దారుణాలు, గుండాయిజం చేసే వారిపై పెట్టే పిడి యాక్టును రైతులు, పేద ప్రజల కోసం పనిచేసే నాయకులపై పెట్టటం దారుణం అన్నారు. ప్రజల కోసం పనిచేసే నాయకునిపై ఈ ప్రభుత్వం పీడియాక్ట్ పెట్టిందంటే ఈ ప్రభుత్వానికి ప్రజాస్వామ్య విలువలు ఉన్నాయా లేవాని ప్రశ్నించారు. అందుకేనా ప్రజలు ఓట్లు వేసి గెలిపించిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అప్పలరాజును స్వేచ్ఛగా విడుదల చేయాలని, లేకుంటే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.



ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కనిగిరి

ప్రజా సమస్యల పరిష్కారానికి 'ప్రజాశక్తి దినపత్రిక చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. ప్రజాశక్తి కనిగిరి క్యాలెండర్‌ను ఆయన స్థానిక నగరవనంలో గురువారం ఆవిష్కరించారు. ప్రజల సమస్యలు నిష్పక్షపాతంగా వెలుగులోకి తెస్తూ పాలకులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. రాబోవు కాలంలో మరింతగా ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు అచ్చాల రవి, టిడిపి మండల అధ్యక్షులు కొండా కృష్ణారెడ్డి, కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి (క్రాంతి), మితుకుల శ్రీనివాసులు, నారపురెడ్డి వెంకటరెడ్డి, ఎస్ఎల్ఎన్ హ్యాపీ హోమ్స్ ఎండి కత్తులపల్లి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

సిఎస్‌పురం : మండలంలోని చింతపూడికి చెందిన పారిశ్రామికవేత్త, టిడిపి సీనియర్ నాయకులు గుంటిమడుగు శ్రీనివాసవర్మ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను శాసనసభ్యులు, టిడిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆవిష్కరించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో కార్యకర్తల నడుమ క్యాలెండర్ ఆవిష్కరించారు. కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, టిడిపి మండల అధ్యక్షులు రమేష్, షీప్ సొసైటీ జిల్లా అధ్యక్షులు తోడేటి గోపి, సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, సిఎస్‌పురం సర్పంచ్ శ్రీరాం పద్మావతి, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, మాజీ ఎంపిపి తోడేటి పెదఅల్లూరయ్య, టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చినమాలకొండయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, దాసరి మల్లికార్జున, చావా సుబ్బయ్య, మైనార్టీసెల్ అధ్యక్షులు మహబూబ్ బాషా, దేవండ్ల తిరుపతయ్య, క్లస్టర్ ఇంచార్జి కె వెంకట కొండయ్య పాల్గొన్నారు.



చైర్మన్ సీతారామయ్యను సత్కరిస్తున్న సింగల్ విండో చైర్మన్లు

విస్తృతంగా పిడిసిసిబి సేవలు

ప్రజాశక్తి - కనిగిరి

ఒంగోలు పిడిసిసి బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతారామయ్య గురువారం స్థానిక పిడిసిసి బ్యాంకును సందర్శించారు. బ్యాంకు మేనేజర్ కృష్ణారెడ్డి, సూపర్వైజర్ ఆట్ల శ్రీను, బ్యాంక్ సిబ్బంధి ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువతో సన్మానించారు. పిడిసిసి బ్యాంక్ ద్వారా ప్రజలకు, రైతులకు అందుతున్న సేవల తీరును తెలుసుకున్నారు. బ్యాంకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. సేవలు విస్తృతంగా అందించేందుకు చేపట్టాల్సిన చర్యలు వివరించారు. ఈ సందర్భంగా ఆయనను కనిగిరి సింగిల్ విండో చైర్మన్ అద్దంకి రంగబాబు, లింగారెడ్డిపల్లి సింగిల్ విండో చైర్మన్ కమతం వెంకటేశ్వరరెడ్డి, ముప్పలపాడు సింగిల్ విండో చైర్మన్ కుందూరు నారాయణరెడ్డి కలిసి అభినందనలు తెలిపారు.

'నూతన' వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కనిగిరి

కనిగిరి, హనుమంతుడు మార్గంలోని ఆర్అండ్‌బి రోడ్డు పక్కన గల నగరవనంలో నూతన సంవత్సర వేడుకల నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గురువారం పరిశీలించారు. జరుగుతున్న ఏర్పాట్లను ఆయనకు వివరించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలతో పాటు జిల్లాల నుంచి వచ్చే టిడిపి శ్రేణులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అటవీ శాఖ అధికారి ఉమామహేశ్వరరెడ్డి నగరవనంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, తెలుగు యువత పట్టణ అధ్యక్షులు అచ్చాల రవి, టిడిపి మండల అధ్యక్షులు కొండా కృష్ణారెడ్డి, కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు ఉండేల శ్రీనివాసులు, తమ్మినేని శ్రీనివాసులురెడ్డి (క్రాంతి), మితుకుల శ్రీనివాసులు, నారపురెడ్డి వెంకటరెడ్డి, ఎస్ఎల్ఎన్ హ్యాపీ హోమ్స్ ఎండి కత్తులపల్లి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి



బహుమతులు అందజేస్తున్న ప్రసాద్

విజేతలకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి - సిఎస్ పురం

మండలంలోని డిజిపేట ఎస్సీ కాలనీలో క్రీడాకారులను ప్రోత్సహిస్తూ సివైసిఎ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. మొదటి బహుమతిని ఊటుకూరి ప్రసాద్ అందజేయగా 2వ బహుమతిని సివైసిఎ యూత్ ప్రదానం చేశారు. ఎస్సీ పాలెం క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఊటుకూరి ప్రసాద్ క్రికెట్ బాల్ స్పాన్సర్ చేశారు. క్రీడాకారులనున ప్రోత్సహిస్తున్న ప్రసాద్‌ను క్రికెట్ క్రీడాకారులు అభినందించారు.

శాంతి, సమభావనకు క్రిస్మస్ ప్రతీక

క్రిస్మస్ ప్రార్థనలో బాపట్ల ఎంపి తెన్నేటి కృష్ణప్రసాద్



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీ

ప్రజాశక్తి - బాపట్ల

మానవాళి ఐక్యత, శాంతి సమభావనకు క్రిస్మస్ ప్రతీకని పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా పట్టణంలో సిబిజెడ్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ క్రీస్తు సందేశాన్ని అనుసరిస్తూ ప్రజలు సుఖ, సంతోషాలతో జీవించాలన్నదే క్రీస్తు బోధనల సారాంశం అన్నారు. ప్రేమ, శాంతి కరుణతో ఏదైనా సాధించ వచ్చన్నారు. ఏసుక్రీస్తు బోధనలు నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

భట్టిప్రోలు : క్రిస్మస్ పండుగ సందర్భంగా వేమూరులో నిర్వహించిన వేడుకల్లో శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సమాజం పట్ల కూటమి ప్రభుత్వంకు చిత్తశుద్ధి, నిబద్ధత ఉందని అన్నారు. ప్రేమ, శాంతి, సేవ, త్యాగం వంటి క్రిస్మస్ మహోన్నత సందేశాలు ప్రతి ఒక్కరి జీవితంలో ఆచరణీయమని అన్నారు. ప్రజల మధ్య ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని కోరారు. గ్రామంలోని సాల్వేషన్ ఆర్మీ చర్చ్, ఎఇఎల్‌సి చర్చి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. చర్చి పెద్దలు, టిడిపి వాలంటీర్ల సమన్వయంతో పిల్లలకు స్వీట్ ప్యాకెట్లు, చాక్లెట్లు, క్రిస్మస్ కేకులు పంపిణీ చేశారు. ఆర్థికంగా బలహీన కుటుంబాలపై ప్రత్యేక శ్రద్ధ చూపారు.

చీరాల : క్రిస్మస్ పండుగ సందర్భంగా కరణం బలరాం కృష్ణ మూర్తి, వైసిపి ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు సహకారంతో వైసిపి మేధావుల సంఘం అధ్యక్షులు తేళ్ల రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు బ్రెడ్లు పంపిణీ చేశారు.

దర్శి : స్థానిక బాప్టిస్టు చర్చితో పాటు అన్ని చర్చలలో క్రిస్టమస్ వేడుకలు జరుపుకున్నారు. చర్చిలన్నీ ముస్తాబు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ సూర్యచంద్ర తోపాటు జాన్ సాల్మన్ ప్రార్థనలు చేశారు. పేదలకు అన్నదానం చేశారు.

తాళ్లూరు : క్రిస్టమస్ సందర్భంగా మండలం వెలుగు వారి పాలెంలో సర్పంచి ముచ్చుమారి కోటేశ్వరమ్మ, బ్రహ్మారెడ్డి ఎస్సీ కాలనీలోని చర్చిలో 245 మంది మహిళలకు చీరలు గురువారం పంపిణీ చేశారు. ఆ గ్రామం పరిధిలోని గంగపాలెం చర్చిలోనూ 40 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శమని అన్నారు. పేదలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో బట్టలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ సాల్మన్, సంఘ కాపరులు, మహిళలు పాల్గొన్నారు.



ప్రార్థనల్లో పాల్గొన్న ఎంఎల్ఎ నక్కా ఆనందబాబు



తాళ్లూరులో చీరలు పంపిణీ చేస్తున్న బ్రహ్మారెడ్డి



చెక్కు అందజేస్తున్న టిడిపి నాయకులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - మార్టూరు

పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో సిఎం సహాయ నిధి ద్వారా సీఎం చంద్రబాబు నాయుడు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు టిడిపి సీనియర్ నాయకులు కామేపల్లి హరిబాబు తెలిపారు. పేదల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు సిఫార్సు మేరకు నాగండ్ల గ్రామానికి చెందిన ఎర్రమాసు శ్రీనివాసరావుకు రూ.8లక్షలు, ద్రోణాదుల గ్రామానికి చెందిన పెంటేల ఆదిలక్ష్మికి రూ.2.50 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు. సిఎంఆర్ఎఫ్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తిలక్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

104లో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి - అద్దంకి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 104 సంచార చికిత్స కేంద్రాల్లో ఖాళీగా ఉన్న డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంబంధిత అధికారి ప్రకటనలో తెలిపారు.డ్రైవర్‌గా 10వ తరగతి, చెల్లుబాటయ్యే హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని తెలిపారు. వీరికి రూ.16వేల వేతనం ఉంటుందని తెలిపారు. డిగ్రీ కంప్యూటర్ పరిజ్ఞానం, అనుభవం ఉన్నవారికి రూ.15వేల వేతనం ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ధృవీకరణ పత్రాలతో విజయవాడ గొల్లపూడి మార్కెట్ యార్డులో ఈనెల 26, 27, 28 తేదీల్లో హాజరు కావాలని భవ్య యాజమాన్యం తెలిపారు.

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -చీమకుర్తి

యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులుగా తాళ్లూరి రోజారావు, చలువాది శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. స్థానిక దాచూరి రామిరెడ్డి యుటిఎఫ్ కార్యాలయంలో ఎస్‌కె. అక్బర్ అధ్యక్షతన యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌కె. ఖయ్యాంబాషా, కోశాధికారిగా పర్వతం వెంకటేశ్వర్లు, సహాధ్యక్షుడిగా మన్నం శ్రీనివాసరావు, సహ అధ్యక్షురాలుగా వై ఉమాదేవి , మహిళా కార్యదర్శిగా తుమ్మ శ్రీదేవి ఎన్నికయ్యారు. మండల కార్యదర్శులుగా పొత్తూరి సురేష్, ఎం.నాగార్జున,సి హెచ్.జయప్రద, బొడ్డు బ్రహ్మయ్య, చల్లా పద్మావతి, పి.శ్రీనివాసరావు, పి. రామారావు, సోమా శ్రీనివాసరావు, ఎలగాల సంజీవరావు, శ్రీనివాసరావు చల్లా సురేష్, కె.సుజిత, పి.కోటమ్మ, పి.భాస్కర్, ఆర్‌వి.చిరంజీవి, పోతురాజు శ్రీనివాసరావు, పి.నాగలక్ష్మి ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా మరో 12 మందిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా కోశాధికారి నర్రా చిన్న స్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ ఎనలేని కృషి చేస్తుందన్నారు. హక్కులు, బాధ్యతలు యుటిఎఫ్‌కు కళ్ళు లాంటివని పేర్కొన్నారు. హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు.ఈ కార్యక్రమంలో పెన్షనుదారుల సంఘం నాయకులు ఎన్.హరి ప్రసాదరావు, జెవివి రాష్ట్ర నాయకులు కె.సుబ్రహ్మణ్యచారి తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న యుటిఎఫ్ జిల్లా నాయకుడు



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వెలిగండ్ల

నిజాన్ని నిర్భయంగా ప్రజలకు చేరవేయటంలో ప్రజాశక్తి దినపత్రిక ముందు వరుసలో ఉంటుందని టిడిపి జిల్లా అధ్యక్షుడు మరియు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి తెలిపారు. కనిగిరిలోని నగరవనంలో ప్రజాశక్తి 2026 నూతన క్యాలెండర్ ను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి,టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, ఒంగోలు పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి షేక్ షరీఫ్, ఏరువ చెంచి రెడ్డి, కసరి రమణారెడ్డి, ముక్కు వెంకటేశ్వర్లు, ముక్కు శ్రీనివాసరెడ్డి, ముక్కు వెంకటేశ్వర రెడ్డి, తీట్ల లక్ష్మీనారాయణ, నారపరెడ్డి మోహన్ రెడ్డి, నల్లబోతుల నాగరాజు, బత్తుల తిరుపతిరెడ్డి నరసింహనాయుడు, ప్రజాశక్తి కనిగిరి డివిజన్ ఇన్‌ఛార్జి వై.కొండలరావు వెలిగండ్ల ప్రజాశక్తి విలేకరి షేక్ మస్తాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణి చేస్తున్న మణిదీప్

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామానికి చెందిన రాచకొండ వెంకట సాయి మణిదీప్ పుట్టినరోజు సందర్భంగా పేదలకు గురువారం దుప్పట్లు అందజేశారు. స్థానిక సాయిబాబా మందిరం, కందుకూరు రోడ్డులోని తెలుగు బాపిస్ట్ చర్చిలో వద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాచకొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి రోజుల్లో యంగ్ జనరేషన్ అంతా రకరకాల పార్టీలు, ఎంజాయిమెంట్లకు అలవాటు పడుతున్న సందర్భంగా తమ కుమారుడు వెంకట సాయి మణిదీప్‌కి చిన్నప్పటి నుంచి ఇలాంటి సేవా కార్యక్రమాలు అలవాటు చేయడం కోసం వృద్ధులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచకొండ కోటేశ్వరరావు, రాచకొండ తేజశ్రీ, సన్నీ, చింటూ, పాస్టర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జైల్ సింగ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విశ్వకర్మ ముద్దుబిడ్డ, మాజీ రాష్ట్రపతి కీర్తిశేషులు జ్ఞానీ జైల్ సింగ్ 31వ వర్ధంతి మండల విశ్వబ్రాహ్మణ సంఘ కార్యాలయంలో గురువారంనిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు, టిడిపి బీసీ నాయకులు ముత్తలూరి మల్లికార్జున చారి జ్ఞానీ జైల్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జ్ఞానీ జైల్ సింగ్ చిన్నతనం నుంచే దైవభక్తి, దేశభక్తితో పెరిగినట్లు తెలిపారు. పంజాబీ భాషలో పండితుడిగా మతపరమైన గ్రంథాలు అధ్యయనం చేసి మతగురువుగా పేరు సంపాదించారన్నారు. సాంప్రదాయ విద్యలో జ్ఞానీ అనే బిరుదు పొందారని వివరించారు. మహాత్మా గాంధీ పిలుపు మేరకు రాజకీయాల్లోకి ప్రవేశించి ఖల్సా సేవక్ అనే పత్రికను నడిపినట్లు తెలిపారు. పెప్సూ రాష్ట్రంలో కాంగ్రెస్ నేతగా ఎదిగారన్నారు. 1947 స్వాతంత్ర్యానంతరం పంజాబ్ కాంగ్రెస్‌లో 1958లో ఎదురు లేని నేతగా నిలిచారని తెలిపారు. 1971 నుంచి 1977 వరకూ పంజాబ్ ముఖ్యమంత్రిగా సేవలందించారని గుర్తు చేశారు. 1980 జనవరి 14న కేంద్ర హోం శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి, 1982 జూలై 15న భారతదేశపు రాష్ట్రపతిగా ఎన్నికైనట్లు తెలిపారు. నిరుపేద కుటుంబంలో పుట్టి దేశంలోని అత్యున్నత పదవిని అధిరోహించిన జ్ఞానీ జైల్ సింగ్ సామాన్య ప్రజల మనిషిగా గుర్తింపు పొందారన్నారు. ఆయన రాష్ట్రపతిగా ఉన్న కాలంలో పేదలు, సాధువులు రాష్ట్రపతి భవన్‌కు నేరుగా వెళ్లి తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. అనంతపూర్ సాహెబ్ పుణ్యక్షేత్ర దర్శనం చేసుకొని తిరిగి వస్తుండగా 1994 డిసెంబర్ 25న రోడ్డు ప్రమాదంలో మరణించారని తెలిపారు. ప్రజల హృదయాల్లో జ్ఞానీ జైల్ సింగ్ ఎప్పటికీ అమరుడిగా నిలిచిపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు జమ్మోజు వెంకటేశ్వర చారి, గౌరవాధ్యక్షుడు గుంటూరు వెంకటాచారి, ముత్తలూరి సత్యనారాయణ చారి, బొద్దోజు బాలయోగి, జి.సత్యనారాయణ చారి, రంగోజు మల్లికార్జున చారి, నందిగం అంజి, ఆర్ మంత్రి, ఎ. శర్మాచారి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు




ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఎమ్మెల్యే ఉగ్ర ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- పిసిపల్లి

ఆ గ్రామంలో 60 సంవత్సరాల తర్వాత కుల మతాలకు సంబంధం లేకుండా గ్రామస్తులందరూ కలిసి దైవ కార్యక్రమాన్ని నిర్వహించారు.రూ. 70 లక్షలతో నిర్మించిన పోలేరమ్మ ,బంగారమ్మ, ఆలయాల్లో గురువారం పొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్ర నరసిహారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వమించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తులందరూ ఐక్యంగా రాజకీయాలకు అతీతంగా గుడిని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రావి గోవిందమ్మ, రావి రాజా, గోనుగుంట్ల కేశవులు ,గోనుగుంట్ల చెన్నయ్య ,వేముల సింగయ్య ,చల్లారవి, వడ్డెంపూడి బ్రహ్మయ్య ,వేముల మాలకొండయ్య ,రావిసింగయ్య, మురుగుమ్మి ఎంపిటిసి చెరుకూరి సతీష్ బాబు, టిడిపి నాయకులు,పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే బిఎన్‌కు సన్మానం

ప్రజాశక్తి-మద్దిపాడు

సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్. విజయ్‌కుమార్‌కు టిడిపి నాయకులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలు మంగమూరు రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, టిడిపి నాయకుడు పోతినేని శ్రీనివాసరావు తదితరులు ఎమ్మెల్యేను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం కేక్ కట్ చేసి తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లవరం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ మార్నేని రాఘవ, టిడిపి నాయకులు ముప్పా రవి, దుగ్గినేని నరసింహారావు, మోపర్తి లాల్ బహుదూర్, కొనిజేటి శివకుమార్, రావిపాటి శ్రీనివాసరావు, రెబ్బవరపు ప్రభాకర్ పాల్గొన్నారు.

క్రిస్మస్ పెద్ద పండుగ : మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు.

ప్రపంచంలోనే అతి పెద్ద పండుగ క్రిస్మస్ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ప్రేమ, శాంతి కరుణ, సేవ అనే శాశ్వత విలువలను అందించిన యేసు క్రీస్తు బోధనలు ఎప్పటికీ అనుసరణీయమన్నారు. శాంతి మార్గాన్ని అనుసరించి ప్రేమ తత్వాన్ని పెంపొందించాలని బైబిల్ చెబుతుందన్నారు. క్రిస్మస్ కానుకగా పాస్టర్లకు గౌరవ వేతనంగా రూ. 51 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు.



కొల్లా కృష్ణయ్యకు మంత్రి స్వామి నివాళి

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలం కట్టావారిపాలెం గ్రామంలో కొల్లా కృష్ణయ్య వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య చిత్రపటానికి రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, టిడిపి సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం సంతనూతలపాడు మండలం రాజుపాలెంలో చల్లా కోటేశ్వరమ్మ దశ దిన కర్మలో పాల్గొని కోటేశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారిలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్యచౌదరి, టిడిపి మండల అధ్యక్షుడు వసంతరావు, బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రావెళ్ల రఘునాథబాబు, గుండపనేని రామూర్తినాయుడు, చింతల వెంకటరావు, మారెడ్డి సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, టిడిపి నాయకులు



రామయ్య చౌదరిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

రామయ్య చౌదరికి సన్మానం

ప్రజాశక్తి-కొండపి

టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా కొండపి మండల వెన్నూరు గ్రామానికి చెందిన గొర్రెపాటి రామయ్యచౌదరి నియమితులయ్యారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు రామయ్యచౌదరి శాలువాలు, పూలమాలతో గురువారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నేతి రవికుమార్, ముక్కు ప్రసాదు, దేపూరి మస్తాన్, దేపూరి సుబ్బారావు, ఆర్. బ్రహ్మనందం, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల్లో విన్నకోట సురేష్

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

యేసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి దిక్సూచి అని జనసేన నాయకులు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మండలంలో మరుప్రోలువారిపాలెం చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు హాజరయ్యారు. అఖండ ఫౌండేషన్ ద్వారా నిరుపేదలకు సహాయ సహకారాలు అందిస్తూ తమ వంతు సేవ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గొట్టిపాటి శ్రీకృష్ణ, కారుమూరి అంజనేష్, పసుపులేటి మహేష్, కొక్కిరాల రాజేంద్ర, పూల శ్రీనివాసరావు, సాయన రాంబాబు, ఈమని మణిదీప్ పాల్గొన్నారు.



పర్చూరు లూథరన్ చర్చిలో పాల్గొన్న క్రైస్తవులు

పర్చూరు : మండలంలో క్రిస్టమస్ పండుగ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రైస్తవ సోదరులు చర్చిలు, ప్రార్థనా మందిరాలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల కేంద్రమైన పర్చూరు లూథరన్ చర్చిలో ఫాదర్ క్రీస్తు జననం గురించి వివరించారు. క్రిస్టమస్ పండుగ సందర్భంగా చర్చలు, మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. బంధుమిత్రులకు మిఠాయిలు పంచిపెట్టారు.



చీరలు పంపిణీ చేస్తున్న తులబందుల బ్రదర్స్

సిఎస్‌పురం రూరల్ : మండలంలో క్రిస్మస్ పండుగ ఘనంగా జరుపుకున్నారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కృష్ణం నాయుడు పల్లికి చెందిన తులబందుల చిన్న గురవయ్య కుమారులు డిజిపేట ఎస్‌సి కాలనీకి చెందిన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

మాజీ సైనికునికి కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి - బాపట్ల

మండలంలో చింతావారిపాలెం వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం చెందిన మాజీ సైనికుడు లుక్క శ్రీనివరప్రసాద్ అంత్యక్రియలు గురువారం నిర్వహించారు. మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు, పలువురు మాజీ సైనిక ఉద్యోగులు నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

మద్యం మత్తులో

ఏఎస్ఐ హల్‌చల్

- ఎఆర్ కానిస్టేబుల్‌పై దాడి
- అడ్డం వచ్చిన పట్టణ సీఐతో వాగ్వాదం
- క్రిస్మస్ వేడుకల్లో మసీద్ సెంటర్‌లో ఘటన
- ఎస్పీ ఆదేశాలతో ఎఎస్సై రవి వీఆర్‌కు..

ప్రజాశక్తి - చీరాల

ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారి మద్యం మత్తులో సహనం కోల్పోయి విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడికి దిగిన ఘటన పట్టణంలోని మసీదు సెంటర్ వద్ద చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఎఎస్ఐ రవిని ఎస్పీ ఉమామహేశ్వర్ విఆర్‌కు పంపించారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. లూథరన్ చర్చిలో ప్రార్థనలు ముగిశాక భక్తుల రాకపోకలు కొనసాగుతున్న సమయంలో రూరల్ ఎఎస్ఐ రవి తన కుటుంబంతో కారులో మసీదు సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడే విధుల్లో రక్షక్ డ్రైవర్ ఎఆర్ కానిస్టేబుల్ శివతో తన కారుకు రక్షక్ వాహనం అడ్డుగా ఉందని సైడు ఇవ్వాలని సూచించగా అక్కడ స్థలం సరిపోతుందని వెళ్లాలని కానిస్టేబుల్ చెప్పడంతో ఎఎస్ఐ రవి మద్యం మత్తులో ఆగ్రహం వ్యక్తం చేశారు. బూతులు తిడుతూ పెద్దగా కేకలు వేస్తూ కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగిన ఆయన అనంతరం దాడికి పాల్పడ్డారని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ సుబ్బారావు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. మద్యం మత్తులో ఉన్న ఎఎస్ఐ రవి సీఐ సుబ్బారావుతోనూ దురుసుగా ప్రవర్తిస్తూ వాగ్వాదానికి దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సిబ్బంది జోక్యంతో ఎఎస్ఐని అక్కడి నుంచి నెట్టుకుంటూ దూరంగా తీసుకెళ్ళినప్పటికి కుటుంబ సభ్యులున్న కారణంగా అక్కడి నుంచి పంపించారు. ఈ ఘటనతో కొంతసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై స్పందించిన ఎస్పీ ఉమామహేశ్వర్ ఎఎస్ఐ రవిని విఆర్‌కు పంపారు. ప్రస్తుతం ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసు వర్గాలు వెల్లడించాయి.

వక్ఫ్‌బోర్డు భూములను

ఐటీ పార్కుకిచ్చే ఆలోచన విరమించుకోవాలి

ప్రజాశక్తి - అమృతలూరు

అంజుమన్ ఏ ఇస్లామియ సంస్థ ఆస్తులను చంద్రబాబు సర్కారు ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పే ప్రయత్నం చేయటం దారుణమని, వెంటనే విరమించుకోవాలని వైసిపి మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హిమాం హుస్సేన్ డిమాండ్ చేశారు. స్థానికంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1915లో అంజుమన్ ఎ ఇస్లామియా సంస్థకు చిన్నకాకానిలో 187/1, 201/2, 2, 201/20, 202/బి, 203/ఏ, బి, 204/ఏ, సి అండ్ డి, 222/2ఏ, అండ్ 2బి నంబర్లలోని 81.23 ఎకరాల భూమిని ముస్లిం సమాజ అభ్యున్నతికి దాతలు ఇచ్చారని అన్నారు. దానికి సంబంధించి పత్రాలు ఉన్నాయని అన్నారు. ముస్లింలకు స్కిల్ డెవలప్మెంట్ కోసం, లైబ్రరీ, ముస్లిం పిల్లలకు స్కాలర్ షిప్‌లు, ముస్లింల విద్యా సంస్థల కోసం ఈ భూమిని అప్పగించారని అన్నారు. వర్ఫ్ బోర్డుకు ఐటీ శాఖ మంత్రి ఓఎస్‌ఓ, పర్సనల్ పిఎ వక్ఫ్‌బోర్డుకు ఈ 81.23 ఎకరాల భూమిలో 71.57 ఎకరాల భూమిని ఐటీ పార్క్ కోసం ఇవ్వాల్సిందిగా కోరారని అన్నారు. దీంతో రాష్ట్ర వక్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ), వక్స్ బోర్డు చైర్మన్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎందుకంత హడావుడిగా వక్ఫ్‌బోర్డు కమిటీ సమావేశం



మాట్లాడుతున్న వైసీపీ నాయకులు ఇమామ్ హుస్సేన్

ఏర్పాటు చేయాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలని కోరారు. దీనికి కలెక్టర్ స్వయంగా పచ్చ మీడియాకు టెండర్లు పిలుస్తూ ప్రకటనలు ఇవ్వడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వక్ఫ్ భూముల జోలికి రాకుండా ముస్లిం సమాజ అభ్యున్నతికి పాటుపడాలనీ కోరారు. దీని వెనుక ఉన్న వక్ఫ్‌బోర్డు సీఈఓపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్‌బోర్డు ఛైర్మన్‌ను పదవి నుంచి తొలగించాలని కోరారు. కమిటీకి సూత్రధారిగా వ్యవహరిస్తున్న తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌పై చర్యలు తీసుకుని వక్ఫ్ ఆస్తులు కాపాడాలని డిమాండ్ చేశారు. లేకుంటే వైసీపీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లి రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



మార్టూరులో మనుధర్మ శాస్త్ర ప్రతులు దగ్ధం

అర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - మార్టూరు

మనుస్మృతిని చాప క్రింద నీరులా అమలు చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల కాషాయ కార్పొరేటర్ ఫాసిజం విధానాలు, అగ్రవర్ణ బ్రాహ్మణీయ భావజాలానికి వ్యతిరేకంగా పీడిత ప్రజలందరూ ఉద్యమించాలని సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ కేంద్ర కమిటీ సభ్యులు మహమ్మద్ భాష కోరారు. బ్రిటిష్ పార్లమెంట్‌లో దళితులకు సముచిత స్థానం కల్పించకపోవడంపై కుల వివక్ష చూపుతున్న అగ్రవర్ణాల చర్యలకు నిరసనగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మనుధర్మ శాస్త్రాన్ని దగ్ధం చేసిన చారిత్రాత్మక దినం గుర్తు చేస్తూ గురువారం మార్టూరు, గన్నవరం రోడ్డులో మనుధర్మ శాస్త్ర ప్రతులు దగ్ధం చేశారు. కార్యక్రమంలో ఓపిడిఆర్ జిల్లా అధ్యక్షులు గాలి సంగీతరావు, అంబేద్కర్ సొసైటీ జిల్లా అధ్యక్షులు మైలా చిన్న నాగేశ్వరరావు, పెయ్యల యేసు రత్నం, రంగనాథ్, మదర్స పాల్గొన్నారు.

టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శిగా చెన్నమ్మ

ప్రజాశక్తి - సిఎస్ పురం

ఒంగోలు పార్లమెంటు టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శిగా టిడిపి సీనియర్ నాయకులు, వి బైలు గ్రామ మాజీ సర్పంచ్ నాగిశెట్టి చినమాల కొండయ్య సతీమణి చెన్నమ్మను నియమిస్తూ ప్రకటించారు. తనపై నమ్మకంతో జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శిగా నియమించిన సిఎం చంద్రబాబు నాయుడుకు, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు, కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి చెన్నమ్మ, మాలకొండయ్య ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం అభివృద్ధికి తమ శాయ శక్తుల కృషి చేస్తామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. గ్రామాభివృద్ధి రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల చుట్టూ తిరిగేవాళ్లని గుర్తు చేశారు. ఈ పాటికే ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి పథకం అందుతుందని అన్నారావు, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా టిడిపి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.



టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నమ్మ

రోడ్డు సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - మార్టూరు

రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని టోల్ ప్లాజా రూట్ పెట్రోలింగ్ ఆఫీసర్ వై శ్రీహరిరెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లా కందుకూరు పట్టణానికి చెందిన శివ సాయి పాఠశాల విద్యార్థులు విహారయాత్రకు విజయవాడ ఐలాండ్ వెళుతూ టోల్‌ప్లాజా వద్ద ఆగారు. బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద విద్యార్థులకు రోడ్ సేఫ్టీ గురించి అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇటీవల జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్న నేపద్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రూట్ పెట్రోలింగ్ వెహికల్ టీం సభ్యులు బి శ్రీనివాసరావు, కె జాన్‌పాల్ పాల్గొన్నారు.



విద్యార్థులకు వివరిస్తున్న వై శ్రీహరిరెడ్డి

దశదినకర్మకు హాజరైన ఎమ్మెల్యే ఉగ్ర

ప్రజాశక్తి - సిఎస్ పురం

సిఎస్‌పురంకు చెందిన టిడిపి నాయకులు సంగిశెట్టి వాసు తల్లి వెంగమ్మ దశదినకు కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాజరయ్యారు. వెంగమ్మకు నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బొబ్బూరి రమేష్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, షీప్ సొసైటీ చైర్మన్ తోడేటి గోపి, టిడిపి నాయకులు గుంటిమడుగు శ్రీనివాస్ వర్మ, నాగిశెట్టి చినమాల కొండయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, తిరుమలశెట్టి రాము, సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బోయళ్ళ నారాయణరెడ్డి, చావా సుబ్బయ్య, తోట చిన్న పాల్గొన్నారు.


లక్ష్మికాంతమ్మ విగ్రహానికి నివాళిఅర్పిస్తున్న దృశ్యం

లక్ష్మికాంతమ్మకు సాహిత్య చరిత్రలో సుస్థిర స్థానం

ప్రజాశక్తి - బాపట్ల

తెలుగు సాహిత్య చరిత్రలో ప్రముఖ కవయిత్రి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ సుస్థిర స్థానం సొంతం చేసుకున్నారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. లక్ష్మీకాంతమ్మ 108వ జయంతి సందర్భంగా టౌన్ హాలు ప్రాంగణంలో ఆమె విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. సంస్కృతాంధ్ర భాషలలో ఆమె 18 పుస్తకాలు రచించారని అన్నారు. ప్రచండ వక్తృత్వ ప్రావీణ్యానికి ఆమె సాహితీ రుద్రమ బిరుదు అందుకున్నారని తెలిపారు. కేరళ ప్రభుత్వం ప్రచురించిన ప్రపంచ సాహిత్య చరిత్రలో ఆమె రచనలకు స్థానం దక్కిందని గుర్తు చేశారు. స్వాతంత్రోద్యమం, ఆంధ్రోద్యమంలో చురుకైన పాత్ర పోషించారని అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి కళా ప్రపూర్ణ పురస్కారం అందుకున్నారని తెలిపారు. ఆమె రచనలపై పరిశోధనలు చేసి పలువురు పిహెచ్‌డి పట్టాలు పొందారని అన్నారు. కార్యక్రమంలో మాధవపెద్ది నిర్మల, న్యూస్ పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


అధ్వానంగా జాగర్లమూడి రోడ్డు

ఆ రోడ్డులో ప్రయాణం ప్రమాదం

ప్రజాశక్తి – యద్దనపూడి

మండలంలోని యనమదల, జాగార్లమూడి మధ్య ఆర్ అండ్ బి రోడ్డు మరీ అద్వారంగా ఉంది. చాలా కాలం నుండి దీని పరిస్థితి అలానే ఉంది. ప్రభుత్వాలు పార్టీలు మారుతున్నాయే గాని రోడ్డు స్థితి మారలేదు. గతంలో యద్దనపూడి పోలీసు స్టేషన్‌లో పనిచేసిన ఎస్ఐ జివి చౌదరి ఈ రోడ్డు స్థితి చూసి పెద్ద గుంటలకు కొన్ని చోట్ల గ్రావెల్ తోలించారు. యద్దనపూడి నుండి జాగార్లమూడి వెళ్లే దివ్యచక్ర వాహనదారులు, ఆటో, కార్లు డ్రైవర్లు నానా అవస్థలు పడుతున్నారు. వింజనంపాడు, పసుమర్రు గ్రామాల మధ్య రోడ్డు ప్రయాణానికి ఇబ్బందిగా ఉంది. యద్దనపూడి నుండి చిలకలూరిపేట వెళ్ళే వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డులో కొంత మేరకు సన్నటి గులకతొలి అలానే వదిలి వేశారు. దాని వల్ల దివ్యచక్ర వాహనాలు ఎక్కడ స్కిడ్ అయి పడిపోతామని భయంగా ప్రయాణం చేస్తున్నారు.ఆరోడ్డులో ప్రయాణం భయంగా ఉందినల్లపనేని వీరేంద్ర, యద్దనపూడి యద్దనపూడికి చెందిన నల్లపనేని వీరేంద్ర మాట్లాడుతూ అర్జెంట్ అవసరమై పర్చూరు వెళ్లాల్సి వస్తే యద్దనపూడి, జాగార్లమూడి వెళ్లనికి చాలా సమయం పడుతుందని చెప్పాడు. పోలూరు గ్రామం వాళ్ళు ఎక్కువగా పర్చూరు వెళతారు. పర్చూరులోని ప్రయివేట్ పాఠశాలు, కాలేజీల్లో చదివే విద్యార్థులు విధిలేని పరిస్థితుల్లో ఈ రోడ్డు గుండా వెళ్ళి తమ పిల్లలు ఇంటికి వచ్చేసరికి అలసిపోతున్నారని అంటున్నారు. రోడ్డు ఇంత అధ్యానంగా ఉంటే అధిక లోడుతో వెళ్లే ట్రిప్పర్లున్న గుంతలు మరీ పెద్దవిగా చేస్తున్నాయని ప్రజలు అంటున్నారు. ఈ గుంతలు సరిచేసే వరకు ట్రిప్పర్లు ఈ రోడ్ల వైపు రాకుండా వాటిని భరిచే రోడ్ల మీదగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నిధులు మంజూరుకు నివేదిక పంపాంశివ నారాయణ, ఎఇ ఆర్ అండ్ బిఆర్ అండ్ బి ఎఇ శివ నారాయణను ప్రజాశక్తి వివరణ కోరగా శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు చొరవతో యనమదల బస్టాండు సెంటర్ నుండి చింతపల్లి పాడు గ్రామం వరకు రూ.కోటితో సిసి రోడ్డు మంజూరైందని తెలిపారు. యనమదల నుండి జాగార్లమూడి వరకు మిగిలిన రోడ్డు నిర్మాణంకు ప్రభుత్వానికి నిధుల మంజూరు కొరకు నివేదిక పంపామని తెలిపారు.

రహదారుల అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు

ఎమ్మెల్యే నరేంద్ర వర్మ వెల్లడి


ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

ప్రజాశక్తి - బాపట్ల

నియోజకవర్గంలో రూ.15.20 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేయనున్నట్లు శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. బాపట్ల నుండి తీర ప్రాంత గ్రామమైన పాండురంగపురం రోడ్డు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈపాటికే పర్యాటక రంగం ప్రగతి దిశగా పయనిస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలో అనేక అభివృద్ధి పనులు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రమైన బాపట్ల నుండి 8 కిలోమీటర్ల మేర పాండురంగాపురం రోడ్డు నిర్మాణం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించాయని తెలిపారు. రోడ్డు అవసరం, ప్రాధాన్యతను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసినట్లు తెలిపారు. ఈ రోడ్డు విస్తరించటంతో పాటు ఈ ప్రాంతాన్ని పర్యాటక రంగంగా మరింత అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఈపురుపాలెం స్ట్రైట్ కట్‌పై వంతెన నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని తెలిపారు. రూ.11 కోట్ల వ్యయంతో ఈ వంతెన నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. సూర్యలంక తీరం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.97 కోట్లు వెచ్చించడమేగాక పర్యాటక మణిహారంగా తీర్చిదిద్దే క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, జనార్దన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ సాయం అందించరూ..?

ప్రజాశక్తి - పంగులూరు



మంచానికే పరిమితమై పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న బాధితులు

ఈమె పేరు సరికొండ అనంతలక్ష్మి, బైట మంజులూరు గ్రామం, 60ఏళ్ల వయస్సు. హొటల్ నడుపు కుంటూ జీవించే వారు. ఆమెకు 2022 సెప్టెంబర్ 30న పక్షవాతం వచ్చింది. ఎడమ కాలు, ఎడమ చేయి పడిపోయాయి. ఒంగోలు, గుంటూరు, చిలకలూరిపేట తదితర ప్రాంతాల్లోని ఆసుపత్రులలో వైద్యం చేయించారు. అయినా ఫలితం లేదు. డాక్టర్లు చేతులెత్తేశారు. అప్పటి నుండి ఆమె మంచంలోనే జీవిస్తుంది. ఆమెకు సపర్యలు చేసేందుకు ప్రత్యేకంగా ఒక మనిషి ఉండాల్సి వస్తుంది. కుటుంబ ఆదాయం సన్నగిల్లింది. పక్షవాతంతో కదలేని స్థితిలో మంచంలో ఉన్న వ్యక్తులకు ప్రభుత్వం నెలకు రూ.15 వేలు పెన్షన్ మంజూరు చేస్తుంది. అయితే అనంతలక్ష్మికి మాత్రం వికలాంగులకు ఇచ్చే రూ.6 వేలు మాత్రమే ఇస్తున్నారు. రూ.15వేల పెన్షన్ కోసం ఈ మూడేళ్లుగా ప్రయత్నం చేస్తున్న ఫలితం లేదని, అధికారులెవరూ స్పందించడం లేదని ఆమె భర్త లక్ష్మణ్ రాజు తెలిపారు.

ఇతని పేరు గొల్లపూడి చిన్నదాసు. 61ఏళ్ల వయస్సు. స్వగ్రామం కోటపాడు. ఇతనికి నాలుగేళ్ల క్రితం పక్షవాతం వచ్చింది. ఇతనికి ఎడమ చేయి, ఎడమ కాలు పడిపోయాయి. అప్పటివరకు కష్టపడి పని చేస్తూ కుటుంబాన్ని పోషించిన ఆయన పక్షవాతంతో మంచాన్ని పడటంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారింది. లేవలేడు, కూర్చోలేడు, కనీసం అన్నం కూడా తినలేని పరిస్థితుల్లో అతని భార్య లక్ష్మి కూలి పనులు చేసుకుంటూ, భర్తకు సపర్యలు చేస్తూ కుటుంబాన్ని ఈదుకొస్తుంది. తన భర్తకు ప్రభుత్వ నుండి పెన్షన్ కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ రోజు రోజుకు భారమైపోతుందని, ఈ పరిస్థితుల్లో తన భర్తకు పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని ఆమె కోరారు. ఈ పరిస్థితి వీరిద్దరిదే కాదు. మండలంలో సుమారు 15 మంది పక్షవాతంతో మంచాన పడి రూ.15 వేల పెన్షన్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. అధికారుల చుట్టూ, ఆఫీసుల చుట్టూ, తిరిగి తమను ఆదుకునే వారెవరూ లేరని అసహనంతో ఉండిపోయారు. ప్రభుత్వం పక్షవాతంతో మంచాన పడిన వారికి నెలకు రూ.15 వేల పెన్షన్ ఇస్తామని ప్రకటన చేసింది. అయితే ఆ పథకం అర్హులైన వారికి అందటం లేదు. సెంటు భూమి లేక, ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ కోసం ఎదురుచూస్తూ కాలం గడుపుతున్నారు. ప్రభుత్వం ఇటీవల పెన్షన్ల విషయమై సర్వే చేసినప్పటికీ వీరికి మాత్రం ఫలితం లేకుండా పోయింది. అన్ని అవయవాలు బాగానే పనిచేస్తూ, అన్ని పనులకు వాళ్లే చేసుకుంటూ జీవించే కొంతమందికి మాత్రం ప్రభుత్వం నెలనెల రూ.15 వేల పెన్షన్ ఇస్తుందనే విమర్శలు ఉన్నాయి. ఇలాంటి నిజమైన అర్హులకు ప్రభుత్వం పథకాలు వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

ప్రజాశక్తి - చీరాల


కేక్ కటింగ్ చేస్తున్న పాస్టర్ యోహాను

నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించండి‘ అన్న క్రీస్తు వాక్యం నుండి అనేక జీవన వాక్యాలు ఆరోగ్య వంతమైన సమాజం కోసం ఎంతో ఉపయోగపడతా యని పాస్టర్ కనకయ్య అన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావంతో ఉండాలని కోరారు. జాలి, ప్రేమ, దయ ఆచరిస్తూ సాటి వారికి సహాయం చేయాలని కోరారు. వేటపాలెం స్మూర్ణ ప్రార్థన మందిరం చర్చ్ పాస్టర్ యోహాను ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో నిరుపేదలకు చీరల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుడారు. అనంతరం పునరుత్థానమై తిరిగి లేచారని తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా పట్టణంలోని పలు ప్రార్థన మందిరాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా మందిరాలలో కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, పలు చర్చిలను విద్యుత్ లైట్లతో అందంగా అలంకరించారు.

వేటపాలెం : క్రిస్మస్ సందర్భంగా చర్చిలను దిద్యుత్తు దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ గ్రామాల్లో ఆటలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.


చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - పామూరు

క్రిస్టమస్ పండుగ సందర్భంగా మండలంలోని కంబాలదిన్నెలో కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చేతుల మీదుగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గ్రామంలో క్రిస్టమస్ సందర్భంగా మోపాడు రిజర్వాయర్ చైర్మన్ చుంచు కొండయ్య ఆధ్వర్యంలో చీరలు పంపిణీలో టిడిపి గ్రామ అధ్యక్షులు మన్నం రమణయ్య, తెలుగు యువత అధ్యక్షులు ఏలూరి మాధవరావు, గోళ్ళ భాస్కరరావు, గద్దె గంగయ్య, గోళ్ళ వీరాంజనేయులు, గోళ్ళ ఏలూరి మహేశ్వరరావు, నల్లబోతుల శీను, ఏలూరి నరసింహారావు, ఒంగోలు ప్రతాప్, ఒంగోలు పురుషోత్తం, ఒంగోలు రాజారావు, బెజవాడ రఘుబాబు, ఆశ కార్యకర్త అరుణ, గొల్ల వీరబాబు, ఏలూరు కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.


తుమ్మల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆధునిక కవుల్లో అగ్రగణ్యులు తుమ్మల

ప్రజాశక్తి - బాపట్ల

మాజంలో జరుగుతున్న దోపిడీ అన్యాయాలను అభ్యుదయ కవుల కంటే ఎంతో ముందుగానే తన కవిత్వం ద్వారా బట్టబయలు చేసి తుమ్మల సీతారామమూర్తి ఆధునిక కవుల్లో అగ్రగణ్యులని సాహితి భారతీయ అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ అన్నారు. తుమ్మల జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నరసింహ వర్మ మాట్లాడుతూ మండలంలోని అప్పికట్లలో స్థిరనివాసం ఏర్పరచుకొని బాపట్ల బోర్డు హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేశారని అన్నారు. అప్పికట్లలో తుమ్మల విగ్రహాన్ని ఏర్పాటు చేసి తెలుగు సాహితీ రంగానికి చేసిన సేవలు స్మరిస్తూ ప్రతి ఏటా ఆయన అభిమానులు సాహితీవేత్తలు, స్మరించుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవయిత్రి ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ, దగ్గుమల్లి శామ్యూల్, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కాళిదాసు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న ఆర్డబ్ల్యూఎస్ రమేష్, మిషనర్ ఓబులేష్

ఎన్టీఆర్ సుజల స్రవంతి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పామూరు

ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద మండలంలోని ఇనిమెర్ల గ్రామానికి మంజూరైన వాటర్ ప్లాంట్ పనులు గురువారం ప్రారంభించారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కృషితో రూ.10 లక్షల నిధులు మంజూరు చేయడం అభినందనీయమని సర్పంచి సిద్ధమూర్తి లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్స్ శివ శంకరరెడ్డి, నెల్లూరు మున్సిపల్ కమిషనర్ ఎద్దు ఓబులేసు, ఆర్డబ్ల్యూఎస్ జెఈ రమేష్, ఎద్దు రామకృష్ణ, ఎద్దు నమ్మయ్య, రామారావు పాల్గొన్నారు.



మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న దళిత నాయకులు

మనువాదాన్ని మట్టుబెట్టేందుకే మనుస్మృతి దహనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మనువాదాన్ని మట్టుబెట్టేందుకే మనుస్మృతి దహనమని దళిత నాయకులు తెలిపారు. 98వ మనుస్మృతి దహన దినోత్సవాన్ని గురువారం ఒంగోలులో నిర్వహించారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయం వద్ద మనుస్మృతి దహన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్. అంబేద్కర్ భావజాలాన్ని దళితులు విస్మరించిన రోజు మనుస్మృతికి మళ్ళీ ప్రాణం వస్తుందన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం కోసం దళితులు మెళకువగా, ఐక్యంగా అంబేద్కర్ భావ జాలంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రఘురాం, మాలమహానాడు అధ్యక్షులు దారా అంజయ్య, నీలంపాలెం అంబేద్కర్ సొసైటీ అధ్యక్షులు వేలూరి శ్రీనివాసరావు, అంక ప్రసాదు, దేవరపల్లి రమణయ్య, మోరపాకుల వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై పోలీసులు దాడులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్:

ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు పలు పోలీస్ స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపులపై ప్రత్యేక పోలీసు బృందాలు పలు పోలీస్ స్టేషన్ల పరిధిలోని బెల్ట్ షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించాయి. టాస్క్‌ఫోర్స్ సీఐ యు. సుధాకర్ ఆధ్వర్యంలో ఎస్సైలు సుదర్శన్, శివరామయ్య, ఏఎస్ఐ మహబూబ్ భాషా మరియు సిబ్బంది ఒంగోలు సబ్ డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల వ్యాప్తంగా విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 94 క్వార్టర్ బాటిళ్లు, 16 బీర్ బాటిళ్లు, 11 బాటిళ్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయా పోలీస్‌స్టేషన్లలో అప్పగించారు.



నిందితుడిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ బృందం

భైరవకోనలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ పూజలు

ప్రజాశక్తి-సిఎస్‌పురం

జిల్లాలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన భైరవకోనను ప్రకాశం జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎస్.ఆయేషాబేగం కుటుంబసమేతంగా గురువారం నాడు సందర్శించారు. జలపాతాన్ని వీక్షించారు. అనంతరం కాలభైరవస్వామిని, త్రిముఖ దుర్గా అమ్మవారిని శివలింగాలను దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ ముప్పాళ్ళ శ్యాం సుందర్‌రాజు, ఈఓ వంశీకష్ణరెడ్డి సూచనల మేరకు ఆలయ అర్చకులు వారితో ప్రత్యేక పూజలు చేయించారు. శేష వస్త్రాలతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మన్నేపల్లి కార్తీక్, ముద్దులూరి వెంకటరాజు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



భైరవకోనలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషాబేగం, కుటుంబసభ్యులు

'హబీబుల్లా' ఫౌండేషన్ సేవలు అభినందనీయం

తహశీల్దార్ కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-పొదిలి

గత ఏడు సంవత్సరాలుగా పొదిలి పట్టణంలో హబీబుల్లా ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని తహశీల్దార్ ఎంవి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సంస్థ ఏడో వార్షికోత్సవ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు .పాల్గొని.. సంస్థ సేవలను అభినందించారు. పొదిలిలో పేదల ఆకలి తీరుస్తున్న సంస్థ ఛైర్మన్ కరిముల్లా బేగ్‌ను సన్మానించారు. కార్యక్రమంవలో ఆర్టీసీ పొదిలి డిపో మేనేజర్ శంకర్‌రావు, ఎస్‌బిఐ మేనేజర్ ఎస్ఎన్.సాహు, తదితరులు పాల్గొన్నారు.



కరిముల్లాబేగ్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

కార్మిక హక్కుల రక్షణకు 'చలో విశాఖ'

సిఐటియు జిల్లా నేతల పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

స్వాతంత్ర్యానంతరం ఎన్నడూ లేనంతగా నేడు కార్మికవర్గం తీవ్రమైన దోపిడీ, అణచివేతను ఎదుర్కొంటోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు కొమ్ము కాసి కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని సిఐటియు ప్రకాశం జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం నాడు వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు ఆంధ్ర ప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా జరగడం రాష్ట్ర కార్మికవర్గానికి గర్వకారణమని వారు తెలిపారు. 2026 జనవరి 4న విశాఖలో జరిగే బహిరంగ సభకు ప్రకాశం జిల్లా నుంచి వేలాది మంది కార్మికులు తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్మికుల జీతాలు పెంచకుండా, జీవితాంతం పనిచేసినా పర్మినెంట్ చేయకుండా, లేబర్ కోడ్స్ పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ విధానాలను ఎదుర్కొనేందుకు సిఐటియు అఖిలభారత మహాసభలలో ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆంధ్రుల హక్కుగా సాధించిన విశాఖ స్టీల్ ప్లాంట్ సహా ప్రభుత్వరంగ పరిశ్రమలను అమ్మివేయడం, పెన్షన్ వ్యవస్థను నిర్వీర్యం చేయడం, కార్మిక సంఘాలు పెట్టనివ్వకుండా సమ్మెలపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు.

మరోవైపు వ్యవసాయ కార్మికుల ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం, విద్యుత్ సవరణ చట్టం ద్వారా ఆ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించడం, విత్తన చట్టంతో రైతాంగానికి నష్టం చేయడం వంటి చర్యలు పేదల పొట్టలు కొట్టే విధానాలేనని అన్నారు. ధరలు ఆకాశాన్ని అంటుతుండగా జీతాలు పాతాళానికి పడిపోయాయని, ఆదానీ-అంబానీ వంటి కార్పొరేట్ల సంపద మాత్రం వంద రెట్లు పెరుగుతోందని మండిపడ్డారు.

ఈ నెల 31 న ప్రారంభమై ఐదు రోజుల పాటు జరిగే మహాసభల అనంతరం జనవరి 4న జరిగే బహిరంగ సభ ద్వారా దేశవ్యాప్తంగా కార్మిక వర్గానికి సమరపిలుపు ఇవ్వనున్నట్లు తెలిపారు. మహాసభలకు ప్రకాశం జిల్లాకు చెందిన కార్మికులు, కార్మిక సోదరీ-సోదరులు కుటుంబ సమేతంగా విశాఖకు తరలివచ్చి ఈ చారిత్రక మహాసభలను విజయవంతం చేయాలని కాలం సుబ్బారావు, ఎం.రమేష్ విజ్ఞప్తి చేశారు.

టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధిగా షాహిద్

ప్రజాశక్తి-పొదిలి



చంద్రబాబుతో షాహిద్

టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధికార ప్రతినిధిగా మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని పొదిలికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు ఎస్. కె.షాహిద్‌ను నియమించారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుకి, మంత్రి లోకేష్, ఎంపి మాగుంట శ్రీనివాసరెడ్డి, స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డికి షాహిద్ కృతజ్ఞతలు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ప్రభువు ఏసు క్రీస్తు లోక రక్షకుడని, పాపులను రక్షించేందుకు ఆయన ఈ లోకానికి వచ్చారని పాస్టర్ నిక్సన్ అన్నారు. స్థానిక క్రిస్టియన్‌పాలెంలో గల సిలోయం చర్చి నందు పాస్టర్ నిక్సన్ సందేశమిచ్చారు. మండలంలోని చర్చిలు, వీధులు విద్యుత్ దీపాలతో కళకళలాడాయి. ఎటుచూసినా పండుగ వాతావరణం కనిపించింది.

'గీతాంజలి'లో..

పొదిలి: స్థానిక గీతాంజలి ఉన్నత పాఠశాలలో క్రిస్మస్ సంబరాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అరవింద్ పాస్టర్, వారి బృందం పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ భాగ్యలక్ష్మి, డైరెక్టర్స్ దుర్గా ప్రసాద్ అలేఖ్య, ప్రజ్వల, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి పాల్గొన్నారు.

'టిడిపి' సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా 'మల్లికార్జున'

ప్రజాశక్తి-మార్కాపురం



మల్లికార్జున

టిడిపి ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ సోషల్ మీడియా జిల్లా కో ఆర్డినేటర్‌గా మార్కాపురం పట్టణానికి చెందిన ప్రముఖ బిల్డర్ రాచకొండ మల్లికార్జున నియమితులయ్యారు. ఈ మేరకు టిడిపి కేంద్ర కార్యాలయం నుండి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. బిసి వర్గానికి చెందిన మల్లికార్జున ఆది నుండీ తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా టిడిపి అధినేత సిఎం చంద్రబాబుతో పాటు లోకేష్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలకు మల్లికార్జున ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే బీఎన్ గృహంలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్. విజయ్‌కుమార్ గృహంలో సంతనూతలపాడు మాజీ సర్పంచ్, బాపట్ల పార్లమెంట్ టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ తల్లి, రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. అధికారి దానం సతీమణి బి.హెచ్.కె.సరోజిని కేక్ కట్ చేశారు. అనంతరం మాజీ సర్పంచి అంకారావు ఎమ్మెల్యే విజయ్ కుమార్, వారి కుటుంబ సభ్యులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సోదరులు ఐ.ఆర్.ఎస్. అధికారి కిషోర్, ఎన్నారై సునీల్, పారిశ్రామికవేత్త అనిల్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న బిహెచ్.కె.సరోజిని

మానవత్వాన్ని చాటిన 'మానవతా' సంస్థ

పేద కుటుంబానికి నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-మార్కాపురం

మానవతా సేవా సంస్థ మానవత్వాన్ని చాటుతోంది. మార్కా పురం మండలంలోని మన్నెంవారిపల్లి గ్రామంలో ఆదాంబి కుటుంబం పేదరికంలో ఉంది. కనీసం తిండకి సైతం నోచుకునేం దుకు ఇబ్బంది పడుతోంది. విషయం తెలుసుకున్న మానవతా సేవా సంస్థ ప్రతినిధులు నెల రోజులకు సరిపడే విధంగా నిత్యావసర వస్తువులన్నీ గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి, కార్యదర్శి అన్నా రాము, కశాధికారి తడికమళ్ల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కంచర్ల ఆంజనేయులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న సంస్థ సభ్యులు

అభ్యంతరాలు వాట్సాప్‌లో కూడా పంపొచ్చు..

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం జిల్లాలో దరి నియోజకవర్గాన్ని కలపాలని కోరుతూ పశ్చిమ ప్రకాశంలోని ప్రజలు తమతమ అభ్యంతరాలను జిల్లా కలెక్టర్ వాట్సాప్ నెంబరు ద్వారా కూడా పంపవచ్చని మేధావులు, విద్యావంతుల వేదిక తరపున ఓరుగంటి మల్లిక్ గురువారం ఓ ప్రకనలో తెలిపారు. అభ్యంతరాలకు ఈ నెల 28తో గడువు ముగుస్తుందని చెప్పారు. ఇప్పటి వరకు వెయ్యికి పైగా అభ్యంతరాలు పంపినట్లు చెప్పారు. ఎవరైనా అభ్యంతరాలు తెలపాలనుకున్న వారు జిల్లా కలెక్టర్ వాట్సాప్ నెంబర్ 8886616001, మార్కాపురం సబ్ కలెక్టర్ వాట్సాప్ నెంబర్ 9966250595లకు పంపవచ్చని వివరించారు.

నేడు ఉచిత మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని శ్రావణి హాస్పటల్‌లో శుక్రవారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ గురువారం తెలిపారు. ఉచిత ఓపిత పాటు ఉచిత స్కానింగ్ కూడా తీయడం జరుగుతుందన్నారు. మహిళలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.